# ఓ మంచివాడి కథ

మంచివాడు - అతిచెడ్డ వాళ్ళందర్లాగానే - పుట్టగానే ఏడ్చాడు. చిన్నప్పుడు అమ్మ కేకలేస్తే ఏడ్చేడు. పక్కింటి పిల్లడు కొడితే ఏడ్చేడు, దెబ్బతగిల్తే, నొప్పిపుడితే 'అమ్మా! హమ్మా!' అంటూ ఏడ్చేడు!

చెడ్డవాళ్లు దొంగ ఏడుపులుకూడా ఏడ్చేరు. మంచివాడు అలా చెయ్యలేక, కొంతగా 'చిన్నప్పుడే చెడిపోయేడు వెధవ!'

బళ్ళో చేరగానే మంచివాడి పలక విరగ్గొట్టేరు. అతనికి బూతుపేరు పెట్టారు. అతని పాతచొక్కాని చింపేరు, కొత్తచొక్కామీద కరక్కాయ సిరా వలకబోసేరు. కొన్నాళ్ళయాక ఆటల్లో అతన్ని డొక్కలో తన్నేరు. పక్కలో పొడిచేరు, మండీకొట్టి మడమసీలమీద తన్ని, అతని కాళ్ళు విరగొట్టబోయేరు. మంచి ఆటల టీముల్లోకి అతన్ని రాకుండా చేసేరు. పెద్దయాక అతను తెచ్చుకున్న టెక్స్టుబుక్కు లరువు తీసుకుపోయేరు. అతను రాసుకున్న నోట్సు ఎత్తుకుపోయేరు. అతను చదువుకునే సమయంలో డిస్టర్బ్ చేసేరు. అతను పడుకున్నప్పుడు వాళ్ళంతా చదువుకున్నారు. అఖర్న, పరీక్షలో అతను రాసిన జవాబులన్నీ కాపీ కొట్టేరు.

మంచివాడు పరీక్షలు పాసయేక, మంచి ఉద్యోగానికి అర్జీపెట్టి వెళ్తే అధికార్లు అతణ్ణి ఎగాదిగా చూసేరు. అన్ని ప్రశ్నలూ వేసేరు, కొంతసేపు ఆలోచించేరు. నీకు పర్సనాలిటీలేదు పొమ్మన్నారు.

మంచివాడు తిరిగి తిరిగి ఒక చిన్న నౌఖరీలో కుదురుకుంటే, అతణ్ణి ఆఫీసరొకసారి మెచ్చుకున్నాడన్నెప్పి హెడ్‌గుమాస్తా కసురుకున్నాడు. పనిపెట్టుకుని మంచివాడిచేత అరవచాకిరీ చేయించుకున్నాడు.

ఆఫీసులో పెద్దలూ చిన్నలూ అంతాకలిసి, మంచివాణ్ని కనీసం చిల్లర చిల్లర లంచాలైనా తినమన్నారు; అతను తిననంటే వెక్కిరించేరు, వెర్రిపేరన్నారు, కక్షగట్టేరు, తంటాలుతెచ్చేరు, అతణ్ణి ఊరూరా తిప్పేరు, ఏ సీటుకీ పనికిరాడన్నారు, ఎందుకూ కొరగాని వాడన్నారు.

మంచివాడికి చాలాకాలంవరకు పెళ్ళికాలేదు.

"అంత మంచివాడికి పిల్లని ఇస్తారే అనుకోండి! కాని, వాడి దినవేఁ తీర్చుకోలేనివాడు దాని దినం ఎలా తీర్చగలడు?!" అంటూ చాలా మంది పెదవులు విరిచేసుకున్నారు.

చివరకొక మంచి ముహూర్తాన మంచివాడు ఓ అరమనిషి సైజుగల ఆడమనిషికి పుస్తెగట్టి ఆనంద బాష్పాలు రాల్చేడు. ఆమెనతడు ప్రేమించేడు. ఇవ్వగలిగినంత సుఖమామెకి ఇచ్చేడు.

ఆవిడ కాపరానికొచ్చేక, పక్కింటికి వెళ్ళి అక్కడ కోడలి నగలు చూసి కిలకిల్లాడి, ఇంటికొచ్చి విలవిల్లాడి పోయింది. ఎదటింటి ఆడపడుచు కోకలు చూసి మురిసి పోయి ఇంటికొచ్చి గింజుకుపోయింది. తన భర్త చవట పెద్దమ్మనే నిశ్చయానికి కొచ్చింది. టాపుతీసి కార్లో షికారూ, అద్దాల మేడల్లో కాపురాలూ, నిలువుటద్దాల ముందు ముస్తాబులూ, డన్లపు్పరుపుల మీది సుఖాలు తల్చుకొని ఆమె తహతహలాడిపోయింది.

చివరకావిడ బక్షీసుల్తో బలిసిన ఆఫీసు బంట్రోతు కుర్రాడే తన పెనిమిటికంటె చలాకీగా ఉన్నాడనే నమ్మకాని కొచ్చింది. ఓరోజున ఆవిడ ఓ స్టూడెంట్ కుర్రాడికి బట్టలిచ్చిన సొగసూ జోడిచ్చిన పొడవూ చూసి మురిసిపోయింది. ఆ తరువాత ఒక సాయబుగారి మెహర్బానీచూసి మోజుపడింది. ఒక పాయట్‌గారి కళ్ళూ కనుబొమ్మలూ చూసి మోహపడి భ్రాంతి పడింది. చివరికొక - షావుకారిగారి డబ్బు చూసి మోహపడిపోయింది.

మంచివాడికి అన్ని రహస్యాలు తెలిసివచ్చిన తరువాత, అందు గురించి ఏం చేయ్యాలో తెలియక, మనసు కమిలిపోగా కుమిలి కుమిలి ఏడ్చి, చీకట్లో దేవుణ్ణి ప్రార్థించి, ప్రార్థించి, నొప్పితో కనురెప్పలు మూసుకుపోగా ఎలాగైతేనేం నిద్రపోయేడు.

అప్పుడా మంచివాడికి భగవంతుడు, కలలో దివ్యసుందర విగ్రహంతో కనిపించి, నాలుగు చేతుల్తోనూ ఆ మంచివాడ్ని మృదువుగా నిమిరి, కరుణాకటాక్ష వీక్షణాన్ని అతనిపై కురిపించి, మృదుమధురహాసంతో అతణ్ని ముద్దుగా మురిపించి, 'ఈ తరువాత రాబోయే నీ ఆరువందల రెండో జన్మలో నీకు మేలు కలుగుతుంది. అందాకా కాస్త ఓపిక పట్టు నాయనా!' అని చెప్పి అతని కలలోంచి నిద్రలోంచి జారుకున్నాడు.

అప్పుడు మంచివాడు నిద్రలో నిట్టూర్చిన నిట్టూర్పు ఆ జారుకున్న దేవుణ్ని వెతకడానికి వెళ్ళి దారి కనిపించక గాల్లో కలిసిపోయింది.

ఆ మర్నాడు మంచివాడు బాధని దిగమింగుకొని దాన్ని అరిగించుకోలేక పైకి కక్కలేక, మెల్లిగా నడుచుకుంటూ ఆఫీసుకి వెళ్తే ఆఫీసు డిప్యూటీ అతన్ని గంటసేపు తిట్టేడు. గంటపైని నాలుగో నిమిషందాకా తిట్లు తిన్నాక మంచివాడికి అలకొచ్చి మంచి కోపం (మంచివాడి కోపం) వచ్చింది. దాన్తో ఆఫీసులో అంతా అతన్ని 'తిరుగుబోతు' వన్నారు. చార్జీలు ఫ్రేం చేసేరు. ఎంక్వయిరీ జరిపించేరు. వార్నింగిచ్చేరు.

అలాగ నాలుగైదు ఎంక్వయిరీలు జరిపించేక మంచివాణ్ని ఉద్యోగంలోంచి డిస్మిస్ చేసేరు.

మంచివాడి స్నేహితులు 'నీ కోపమే నీ కొంప ముంచిం' దన్నారు. విరోధస్తులు 'పొగరుబోతు వెధవకి ప్రాయశ్చిత్తం జరిగిందన్నారు, చాలా మంది 'అతనికి శౌర్యం లా'వన్నారు. చుట్టాలంతా అతణ్ని 'నీ బతుకేదో నువ్వు బతుకు, బతకలేకపోతే నీ ఇష్టం వచ్చింది చేసుకో! కాని, మమ్మల్ని మాత్రం చంప' కన్నారు. అతని భార్య అతణ్ని షావుకారుగారి కొట్లో గుమస్తాగా చేరి కుక్కలా పడుండమంది.

మంచివాడు నీచానికి దిగలేనన్నాడు. చెడ్డపని చేయలేనన్నాడు.

'నువ్వెందుకూ పనికిరావు. మరి ఎలా? ఏట్లో పడిచావు!' అని అంతా అతనికి

ఉచితంగా సలహా ఇచ్చేరు.

మంచివాడు పళ్ళు కొరికేడు జుట్టు పీక్కొన్నాడు. కడుపు మాడగా, కళ్ళు మండగా, కాళ్ళు పీకగా, గాలిపీలుస్తూ నీరు త్రాగుతూ, ఎండ తింటూ, ఊరంతా తిరిగి తిరిగి అంధకారంలో మునిగేడు.

ఊరవతల అర్ధరాత్రి చీకట్లో కొండవార బండరాతిమీద కూర్చొని మంచివాడు "నేనేంచెయ్యడం???" అంటూ గావుకేకలువేసి దేవుణ్ని ప్రశ్నించేడు. దేవుడు పలకలేదు. బండరాయి ప్రక్క కొండ మాత్రం "డం???" "డం???" అంటూ ప్రతిధ్వనించింది. అది విని విని మంచివాడు వెర్రిగా నవ్వేడు.

ఆఖరికి అక్కణ్నించి లేచి చీకట్లోంచి, కాట్లోంచి, రోడ్డుమీంచి ఊళ్ళోకి వచ్చి అందర్నీ సలహా లడిగేడు. కొంతమంది నవ్వేరు. కొంతమంది నిట్టూర్చేరు.

మరో నౌఖరీ చూసుకోకూడదా? దొరకదు దొరకదని ఫో పొమ్మనీ అంతా గెంటేశారు. షావుకారుకూడా "ఉంపుడుగత్తె పక్కలో ఉంటే పక్కనే మొగుడెందుకు?" అనుకున్నాడు. అంతాకూడా, తిక్కవెధవలూ తిరుగుబోతు వెధవలూ చాకచక్యంలేని వెధవలూ మాకక్కర్లేదు పొమ్మన్నారు.

కిల్లీకొట్టు పెడితేనో?

పెట్టలేవు. పెట్టినా నడపలేవు. నీకు కిల్లీలు చుట్టడం అయినా రాదు. వచ్చినా నీ పానంతా అరువుగాళ్ళు తినేస్తారు.

కిరాణా కొట్టు ఓపెన్ చేస్తేనో?

నీకు మదుపులేదు. చురుకులేదు. తప్పుతూనికల్తూచలేవు. దొంగ సరుకు అమ్మలేవు. చిల్లర ఆఫీసర్లకి లంచాలివ్వలేవు. బీదవాళ్ళకి అరువివ్వకుండా ఉండలేవు. లాభాల్తియ్యలేవు.

మరేదైనా వ్యాపారం ?

నువ్వే వ్యాపారానికి పనికిరావు. మదుపుండాలి, మాయుండాలి, రెండూ లేవు నీ దగ్గిర.

రిక్షా లాగితేనో?

లాగలేవు. లాగినా రెండేళ్ళలో గుండె ఆగి చస్తావు.

వ్యవసాయం ?

భూం వెవడిస్తాడు?!

చాకలి పని? బారిక పని ?

నువ్వాఖరికి మంగలి పనిక్కూడా పనికిరావు. బుర్ర గొరగడం కూడా ఆనెస్టుగా గొరుగుతా నంటావు. బుర్ర దగ్గిర నయాపైస కిట్టదు. అలాగైతే, అయినా, మాయగాళ్ళు లక్షమందుండగా నీచేత ఎవడు గీయించుకుంటాడు బుర్ర?? నీకు ఆ ఛాన్సేలేదు.

మరైతే నేనెందుకు పనికొస్తాను?

నువ్వెందుకూ పనికిరావు. దొరపని (అంటే దొంగ పనే అనుకో) ఆ పనికీ పనికిరావు.

అసలైన దొంగ పనికి అసలే పనికిరావు అన్నారంతాను.

సాయంకాలం ఏడయింది.

మంచివాడికి ఏడుపొచ్చింది.

"మరైతే నేను చావడానికి తప్ప మరి ఎందుకూ పనికిరానా?" అంటూ అతను సముద్రం వైపు పరిగెట్టేడు. అక్కడ వడ్డున నిశ్చేష్టుడై నిలబడి పోయేడు.

చీకట్లో సముద్రపు కెరటాలు 'నువ్వు చావుకి' అంటూ పైకిలేచి, "ప్పన్కిరావ్" అంటూ గర్భమని విరిగి "నువ్వు చావనూకూడాలేవుస్మా!" అనే అర్థంతో మాటల్ని విరిచి విరిచి అతనికి సుస్పష్టంగా తెలిసేటట్టుగా అరిచి అరిచి చెప్పేయి.

రాత్రంతా చీకటిగా బాధల పుట్టలా ఉంది.

రాత్రంతా చీకటిగా రాక్షస బొగ్గులగనిలా ఉంది. తెల్ల వారింది.

నిప్పురవ్వలా ఇనుడు ఉదయించేడు. నీళ్ళల్లోంచి నిప్పుల చక్రంలా బైటకి పూర్తిగా లేచేడు

సముద్రానికి కొండకీ మధ్య ఇసకలో నిల్చొనే ఉన్నాడు మంచి వాడు.

చీకటంతా బెదిరి చెదిరిపోయింది. ఆకాశంలో మబ్బులు తూలి తూలి పోయేయి. తెలివొచ్చిన చల్లగాలి వీచిపోతోంది. సముద్రపు కెరటాల తురాయిలన్నీ రంగురంగుల రంగుల్తో పైకి పైకి లేచేయి.

అంతలో భూమి అదిరింది. ఎక్కణ్నించో కోటిగొంతులపాట వినిపించింది.

చప్పుడువిని తిరిగిచూసేడు మంచివాడు. వాళ్ళ ముఖాలన్నీ ఉదయకిరణాల్లో వింతశోభతో మెరుస్తున్నాయి. ముందుకుసాగే సేనల ఎగిరే జెండాల్లా ఉన్నారువాళ్ళు. వాళ్ళ భుజాలమీద మాత్రం బరువైన బండరాళ్ళు తీరిగ్గా అమిరున్నాయి. వాళ్ళంతా దేవుడి దండులా పున్నారు.

'ఎవరు మీరు? ఎక్కడికి వెళ్తున్నారు?' అని ప్రశ్నించేడు మంచివాడు.

'మమ్మల్ని రాయిమడుసు లంటారు. మేం మంచిలోకాన్ని నిర్మించడానికి వెళ్తున్నాం' అన్నారు వాళ్ళు.

మంచివాడి కళ్ళంట ముత్యం బిందువులు రాలేయి. అతను అతి నిర్మలంగా నవ్వేడు. వెంటనే జీవితం అనే బండరాయి తీసి భుజాన వేసుకొని పాటతో పాటు అతను అటువైపు నడిచాడు.

*యువ, మే 1964*